జల్సాల కోసం చోరీల బాట

- జైలులో కలిసి.. ముఠా కట్టి..
- అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- పట్టుబడిన నలుగురు
- వీరిలో ఇద్దరు ఉన్నత విద్యావంతులు
- రూ.7.74 లక్షల సొత్తు స్వాధీనం


నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును మీడియాకు చూపుతున్న డీఎస్పీ మాధవరెడ్డి, సీఐ కొండలరావు

అమలాపురం టౌన్: జైలు జీవితం ఆ నలుగురినీ స్నేహితులను చేసింది. అప్పటి వరకూ ఒక్కొక్కరుగా అనేక నేరాలకు పాల్పడి వారు.. శిక్షా కాలం ముగిశాక ముఠాగా ఏర్పడ్డారు. ఉమ్మడిగా చోరీలు మొదలు పెట్టారు. అటు హైదరాబాద్.. ఇటు మన రాష్ట్రంలోనూ అనేక చోరీలకు పాల్పడ్డారు. తీగ లాగితే డొంక కదిలినట్లు అమలాపురంలో గత ఏడాది అక్టోబర్‌లో చేసిన ఓ ఇంటి దొంగతనం దర్యాప్తులో ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టయింది. పట్టణ పోలీసులు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఈ ముఠాను పట్టుకున్నారు. ఈ వివరాలను డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు, ఎస్సై ప్రభాకర్ శనివారం ఉదయం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన గొర్రెల చినబాబు, టేకుమూడి దుర్గాప్రసాద్, ఉప్పులూరి భాస్కర శివరాజు, ఒక బాలుడు ఈ ముఠాలో ఉన్నారు. ఈ నలుగురూ చెడు వ్యసనాలకు లోనై, ఇంటి దొంగతనాలను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. అలా వస్తున్న డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. అనువైన ఇళ్లను ఎంపిక చేసుకుని, చోరీలకు పథకం వేస్తారు. ఈ ముఠాలోని చినబాబు బీటెక్ చదివి, మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కూడా పని చేశాడు. ఉప్పులూరి భాస్కర శివరాజు దివ్యాంగుడు. ఇతడు ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. టేకుమూడి దుర్గాప్రసాద్ ఆటో డ్రైవర్. ఈ ముఠాలోని బాలుడికి కూడా అనేక నేరాలతో సంబంధాలున్నాయి. వీరిలో ఒక్కొక్కరిపై 5 నుంచి 15 చోరీ కేసుల వరకూ ఉన్నాయి. అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో 5, రాజోలులో 1, పెరవలి 1, ఏలూరు 1, నర్సీపట్నం 1, దువ్వాడ 2, విశాఖపట్నం మువ్వలవానిపాలెం 1, హైదరాబాద్ ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో 2 చొప్పున కేసులు ఈ ముఠాపై ఇప్పటికే నమోదయ్యాయి. వీరు పలు కేసులలో శిక్షలు కూడా అనుభవించారు. ఈ కేసులతో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, పెద్దాపురం, రావులపాలెం, పి.గన్నవరం, కొత్తపేట, అనపర్తితో పాటు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెం పోలీసు స్టేషన్లలో కూడా ఈ ముఠాపై చోరీ కేసులు ఉన్నాయి. ఈ ముఠా నుంచి పోలీసులు 56.7 గ్రాముల బంగారు నగలు, 3.150 కేజీల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు, రెండు మోటారు సైకిళ్లు, రూ.1.84 లక్షల విలువైన ఇతర సామగ్రి కలిపి మొత్తం రూ.7.74 లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బంది, క్లూస్ టీములను జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

55 వేల మందికి టెన్త్ స్టడీ మెటీరియల్


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.1.2 కోట్ల వ్యయంతో 55 వేల మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని 766 మంది పదో తరగతి విద్యార్థులకు ఆయన ×జగనన్న విద్యాభారతి₹ స్టడీ మెటీరియల్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. పి.గన్నవరం జెడ్పీ హైస్కూలులో ఎంఈఓ కోన హెలీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, సర్పంచ్, ఎంపీటీసీ సమాఖ్యల అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, ఆదిమూలం సూరయ్యకాపు, ఎస్ఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలుండవు


వారోత్సవాల సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

రామచంద్రపురం: రోడ్డు ప్రయాణంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు సంభవించవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను శనివారం నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత జీవీరావు అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, చట్టాలను వివరించారు. రామచంద్రపురం ఎస్ఐ కెపీ వీఎస్ఆర్ ఆచార్యులు మాట్లాడుతూ అతివేగం అనర్థదాయకమన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ నాగేశ్వరరావు

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

మండపేట: మానవ తప్పిదాల వల్లే 90 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని మండపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక రవాణ శాఖ యూనిట్ కార్యాలయం వద్ద వాహన డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక శాతం ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని చెప్పారు. పరిమిత వేగంతో ప్రయాణించాలని, ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేయకూడదని సూచించారు. లారీ, ఆటో తదితర వాహనాల డ్రైవర్లు, కార్యాలయ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏనాడూ పోరాడని వ్యక్తి విమర్శలు చేయడమా

సూర్యనారాయణ వైఖరిపై ఏపీ ఎన్‌జీవో జిల్లా సంఘం ఆగ్రహం


అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నేతలు

కాకినాడ సిటీ: నిరంతరం ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కుల సాధనకు పోరాడుతున్న తమ సంఘాన్ని ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించడాన్ని ఏపీ ఎన్‌జీవో సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. కాకినాడలోని ఏపీ ఎన్‌జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గం అత్యవసర సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సూర్యనారాయణ అడ్డదారుల్లో రూసా రూల్స్‌కు విరుద్ధంగా సంఘానికి గుర్తింపు తెచ్చుకుని, ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా.. 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీ ఎన్‌జీవో సంఘాన్ని విమర్శించడం ఎంతవరకూ సమంజసమని నేతలు ప్రశ్నించారు. ఎన్‌జీవో సంఘం పూర్వ నేతలు సాధించిన కారుణ్య నియామకం జీవోలో ఉద్యోగం పొంది, ఆ ఫలాల్ని అనుభవిస్తూ అదే సంఘాన్ని విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలిపెడుతున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీవో సంఘం అహర్నిశలూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు, హక్కుల సాధనకు పోరాడుతుందని చెప్పారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్లు, కరువు భత్యం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని తమ సంఘం డిమాండ్ చేసిందన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, కోశాధికారి వై.పద్మ మీనాక్షి, సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో బాధిత కుటుంబానికి భరోసా


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా పథకం కొండత భరోసానిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. 20వ వార్డు గొల్లపుంత కాలనీలో రెండు కుటుంబాల వారిని శనివారం చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శించారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి తక్షణసాయంగా మంజూరైన రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన సాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమవుతుందని చెప్పారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గునిపే నాగభూషణం, గుమ్మిలేరు శ్రీనివాస్, షేక్ మస్తాన్, శీలం విజయలక్ష్మి, పిన్నెడ్డి కృపావతి, కొమ్మోజు నాగేశ్వరరావు, ఇందుగుమిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లేఅవుట్‌లో మౌలిక వసతుల ఏర్పాటు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్, సర్పంచ్ ఆరిఫ్‌లు

రాయవరం: ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన ప్రతి లేఅవుట్‌లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్ తెలిపారు. మండలంలోని సోమేశ్వరంలో శనివారం జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను సర్పంచ్ ఆరిఫ్, వైఎస్సార్‌సీపీ నేత ధూళిపూడి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టి ఉగాది నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 1,651 ఇళ్లు మంజూరు కాగా, 325 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 150 ఇళ్లు కంప్లీట్ దశలో ఉండగా, 800 ఇళ్లు పునాది దశలో ఉండగా, 350 ఇళ్లు నిర్మాణాలకు లెవెలింగ్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎంపీడీవో డి.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డికి ఆయన సూచించారు.

గ్రంథాలయ భవనానికి స్థల పరిశీలన


రాయవరంలో వెంకన్నబాబును సత్కరిస్తున్న సర్పంచ్ రామకృష్ణ, ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: స్థానికంగా ఉన్న శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి శనివారం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు స్థల పరిశీలన చేశారు. స్థానిక పంచాయతీ స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందని స్థానిక నేతలు నిర్ణయించారు. గ్రంథాలయ నిర్మాణానికి నిధులు వచ్చేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ రాయవరంలో గ్రంథాలయ భవనానికి నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. దాతలు ముందుకొస్తే వారి పేరున భవన నిర్మాణం చేసేందుకు గల అవకాశాన్ని ప్రభుత్వం దృష్టిలో పెడతామని వెంకన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నబాబును స్థానిక నేతలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఎంపీటీసీ తుపాలకు ప్రసన్నకుమార్, ఏఎంసీ డైరెక్టర్ తేతల సుబ్బిరామారెడ్డి, ప్రముఖ న్యాయవాది తాడి రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, సిరిపురపు శ్రీనివాసరావు, మంతెన అచ్యుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం నుంచి మహిళ అరుపులు

తాళం తెరిచి చూస్తే ఎవరూ లేరు


భవనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మండపేట: మండపేట పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన శిథిల భవనం నుంచి అర్ధరాత్రి సమయంలో మహిళ అరుపులు వినిపిస్తున్నాయన్న వదంతులు శనివారం పట్టణంలో వైరల్ అయ్యాయి. మున్సిపల్ అధికారులు, మీడియా అక్కడకు చేరుకుని తాళం తీసి చూడగా లోపల ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకుని మున్సిపాలిటీకి చెందిన రిక్రియేషన్ క్లబ్ భవనం శిథిల స్థితికి చేరుకుంది. గ్రౌండ్ ఫ్లోర్‌ను శానిటేషన్ విభాగానికి గొడౌన్‌గా వినియోగిస్తున్నారు. పైఅంతస్తును ది మండపేట మున్సిపల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంగా రెగ్యులర్ వర్కర్లు వినియోగించుకుంటున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం భవనం పైఅంతస్తు నుంచి మహిళ అరుపులు వినిపించాయని పక్కనే నివసిస్తున్న కె.సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, మీడియా దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆదేశాల మేరకు మేనేజర్ టి.కనకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలు భవనం వద్దకు చేరుకుని తాళం తీయించి చూస్తే ఎవరూ కనిపించలేదు. అక్కడ ఖాళీ మద్యం సీసాలు మాత్రమే ఉన్నాయి. మీ సేవ భవనం పక్క నుంచి శిథిల భవనం పైఅంతస్తుకు దారి ఉందని, బయటి వ్యక్తులు ఈ మార్గంలో వెళ్లి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సారారహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐలు శివకృష్ణ, రాంబాబు తదితరులు

మండపేట: సారా రహిత గ్రామంగా చినద్వారపూడిని తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఆలమూరు సెబ్ ఎస్ఐ రాంబాబు కోరారు. మండలంలోని ద్వారపూడి శివారు చినద్వారపూడిలో శనివారం సెబ్ ఎస్ఐ రాంబాబు, రూరల్ ఎస్ఐ శివకృష్ణలు గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తయారీ, వినియోగం వలన కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న సారా మహమ్మారిని గ్రామం నుంచి తరిమికొట్టడంలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని కోరారు. ఎక్కడైనా సారా తయారుచేస్తున్నా, విక్రయిస్తున్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

ఘనంగా పుట్టాలమ్మ జాతర, తీర్థం



పుట్టాలమ్మ ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: పామర్రులో గ్రామదేవత పుట్టాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తీన్‌మార్, బుట్టబొమ్మలు, కోయడాన్సు, బ్యాండు మేళాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత పుట్టాలమ్మ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దర్శించుకుని పూజలు చేశారు.

పడమర ఖండ్రికలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు



పడమర ఖండ్రికలో చికిత్సనందజేస్తున్న రత్నకుమారి

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రికలో శనివారం అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలందించారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.రత్నకుమారి గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు సందర్శించారు.

ఏకాగ్రత ఎంతో అవసరం

రామచంద్రపురం: విద్యార్థులకు ఏకాగ్రత ఎంతో అవసరమని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్ అన్నారు. యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగావకాశాలు అంశాలపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకాలజిస్టు సత్యశిరీష మాట్లాడుతూ ప్రవర్తన, మనోవికాసం, ఏకాగ్రత, ఉద్యోగావకాశాలపై వివరించారు.

భక్తుల కల్పవల్లి.. పోలమ్మ తల్లి



పోలమ్మ తల్లి ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లు



రాయవరంలో భక్తుల నీరాజనాలు అందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

- 24న పోలమ్మ అమ్మవారి జాతర
- నేడు ముత్యాలమ్మ జాతర

రాయవరం: ఎవరైనా నూతన వాహనం కొనుగోలు చేసినా, వ్యాపారం ప్రారంభించుకున్నా, వివాహమైనా ముందుగా పోలమ్మతల్లికి మొక్కుతారు. ఒక రాయవరం గ్రామానికే పరిమితం కాకుండా సమీపంలోని పదుల సంఖ్యలో గ్రామాలకు భక్తులకు అమ్మ కులదైవంగా విరాజిల్లుతుంది. ఈ నెల 24న రాయవరంలో నిర్వహించే అమ్మవారి జాతరకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు.

వసంత నుంచి వచ్చినట్లుగా

గ్రామంలోని తుల్యభాగ నదీ తీరాన ఉన్న పోలమ్మ తల్లి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని గ్రామస్తులు చెబుతారు. విజయనగరం జిల్లా వసంత గ్రామం నుంచి వందల ఏళ్ల క్రితం కొప్పువెలమ కులస్థులు రాయవరం గ్రామానికి వలస వచ్చారు. ఆ సమయంలోనే వసంత గ్రామం నుంచి అమ్మవారు ఇక్కడికి వచ్చినట్లు భక్తుల విశ్వాసం. ఊడిగ చెట్టు వద్ద అమ్మవారి విగ్రహాలు కనిపించడంతో అక్కడే ఆలయాన్ని నిర్మించారు. మొదట్లో కేవలం కొప్పు వెలమ కులస్థులు మాత్రమే అమ్మవారిని కొలవగా నేడు కుల, మతాలతో సంబంధం లేకుండా అమ్మవారు గ్రామదేవతగా మారారు.

ఇతర జిల్లాల నుంచి...

రాయవరంలో జరిగే పోలమాంబ ఉత్సవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పశ్చిమ గోదావరి, విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తారు. రాయవరం గ్రామానికి చెందిన ఆడపడుచులు కూడా ఉత్సవానికి తప్పనిసరిగా వస్తారు. సంక్రాంతికి వచ్చిన ఆడపడుచులు ఉత్సవం వెళ్ళేవరకు అమ్మగారి ఇంటి వద్ద ఉండడం పరిపాటిగా వస్తుంది.

రేపు ముత్యాలమ్మ జాతర

ఈ నెల 24న జరిగే పోలమ్మతల్లి ఉత్సవం మూడు రోజుల పాటు సాగుతాయి. ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి జాతరతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల సందర్భంగా గారడీలు, బ్యాండు మేళాలు, కోయ డ్యాన్సులు, గరగ నృత్యాలు, సంగీత విభావరులు, కోబ్రా డాన్సులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాడు వెంకటరమణ తెలిపారు.

బులిస్వామిరెడ్డి సేవలు అభినందనీయం



రోగులకు మందులు అందజేస్తున్న హనుమాన్, బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: మహిళల ఆర్థిక స్వావలంబనకు, హిందూ పరిరక్షణకు రెండున్నర దశాబ్దాల కాలంగా ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నవరం దేవస్థానం మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్ అన్నారు. ట్రస్ట్ చైర్మన్ బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అర్తమూరులో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా 155 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం పేదల ఆరోగ్య పరిరక్షణపై బులిస్వామిరెడ్డి అంకిత భావానికి నిదర్శనమన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 270 మంది పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, తాడి కోదండరామిరెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తాడి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

రాయవరం: మండలంలోని పలు పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఆదేశాల మేరకు పాఠశాలల తనిఖీ చేపట్టారు. రాయవరం, చెల్లూరు, వెంటూరు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పప్పు శ్రీనివాసరెడ్డి, బి.వీరభద్రరాజు, డి.సత్తిరాజులు పాఠశాలలో అమలవుతున్న అకడమిక్, నాన్ అకడమిక్ విషయాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు డైరీలు రాస్తున్నారా, లెసన్స్ ప్లాన్స్ రాస్తున్నారా, విద్యార్థుల నోట్స్‌ల కరెక్షన్స్ చేస్తున్నారా తదితర విషయాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సీఆర్పీలు వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కె.సీనాసిరి, కిలపర్తి పోసిరాములు, వై.లక్ష్మీవీర్రాజు పాఠశాలలను సందర్శించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



పడమర ఖండ్రికలో ఆర్‌బీకే భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎ.శాంతి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లోని ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ చూపాలని మండల స్థాయి అధికారులను మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి ఆదేశించారు. పడమర ఖండ్రికలోని జగనన్న కాలనీని శనివారం ఆమె సందర్శించి లబ్ధిదారులతో చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, నేల సూర్యకుమార్ ఉన్నారు.

పీఎంశ్రీ పథకానికి రెండు పాఠశాలల ఎంపిక

కె.గంగవరం: కోటిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల, దంగేరు ఉన్నత పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పథకానికి శ్రీకారం చుట్టాయని, దానికి మండలంలో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. ఈ రెండు పాఠశాలల్లో సకల మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 శాతం నిధులు కేటాయిస్తారని చెప్పారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించడంతో పాటు గుణాత్మక విద్య, ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం వంటి సదుపాయాలు కలిస్తారని చెప్పారు.

సవరణ

ది. 21-01-2023 సాక్షి దినపత్రిక మండపేట క్లస్టర్ పేజీ నెం.IIIలో సేలటూరు గ్రామ పంచాయతీ ప్రకటనలో అనధికార లే-అవుట్ నందు క్రయం పొందిన స్థలములందు కొనుగోలుదారులకు ఎటువంటి నిర్మాణాలకు గ్రామ పంచాయతీ నుండి ఎటువంటి అప్రూవల్స్ ఇవ్వబడునని పబ్లిష్ అయినది. దానికి బదులుగా ఎటువంటి అప్రూవల్స్ ఇవ్వబడవని చదువుకోగలరు.

రెండు కేంద్రాల్లో కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

రామచంద్రపురం: ఈ నెల 22న జరిగే పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష రామచంద్రపురం పరిధిలో పట్టణంలోని వీఎస్ఎం కళాశాల, ఏ అగ్రహారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో జరుగుతుందని డీఎస్పీ ఎం.బాలచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారని చెప్పారు. నిర్దేశిత సమయాని కన్నా ముందే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా అభ్యర్థులు ప్లాన్ చేసుకోవాలని కోరారు. పరీక్ష సమయం 10 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరని చెప్పారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పాటు ఒక ఫొటో గుర్తింపు కార్డు, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని సూచించారు. ఏ విధమైన ఎలక్ట్రానిక్ (సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్, బ్లూటూత్) వంటి వస్తువులు పరీక్ష హాల్‌లోకి తీసుకురాకూడదన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల వివరాలను తెలియజేసేందుకు రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఏదైనా సహాయం అవసరమైతే 94407 96589 మొబైల్ నెంబర్‌కు లేదా 08857 242333కు సంప్రదించొచ్చని చెప్పారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్ పంపిణీ

రాయవరం: సోమేశ్వరం కాపు కళ్యాణ మండపంలో శనివారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్‌ను సర్పంచ్ ఆరిఫ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న సంపూర్ణ పోషణ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నేత ధూళిపూడి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్‌వీ అంజలి తదితరులు పాల్గొన్నారు.